
యూనిట్ 3

# 12. గాలిపటం

## చిత్రం చూడండి - ఆలోచించండి - మాట్లాడండి



★ చిత్రంలో ఎవరెవరున్నారు?

★ పిల్లలు ఏం మాట్లాడుతున్నారు?

★ బ్యాట్ తనను గురించి తాను ఏమి చెబుతున్నది?

**పిల్లలకు సూచనలు :**

★ పాఠంలోని చిత్రాలను చూడండి. చిత్రాలను గురించి మాట్లాడండి.

★ పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద గీత గీయండి.

★ గీత గీసిన పదాలకు అర్థాలను మీ మిత్రులను గాని, ఉపాధ్యాయులను గాని అడిగి లేదా 'పదాలు – అర్థాలు' అనే పట్టికలో చూసి తెలుసుకోండి.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

3rd Telugu FL initial pages fina95 95 28-08-2012 13:33:03



ప్రియమైన బాలలూ!

మీ కందరికీ శుభోదయం. నన్ను గుర్తుపట్టగలరా?

**నింగిలో ఎగురుతానుగానీ పక్షిని కాను**

**తోక ఉన్నదిగానీ జంతువును కాను**

**రెక్కలు లేవుగానీ పైకెగరగలను**

**ఎవరినీ నేనెవరిని?**

శభాష్ పిల్లలూ! నన్ను గాలిపటమని భలేగా గుర్తించారే! మీ కందరికీ నాతో ఆడుకోడమంటే ఇష్టం కదా! మీతో ఆడుకోడం నాక్కూడా చాలా ఇష్టం. సాయంత్రం మీ బడి అయిపోగానే మీరు ఎప్పుడు నాతో ఆడతారా అని ఎదురుచూస్తూ ఉంటాను. మీరు నన్ను గాలిలోకి ఎగరేయగానే ఎంత ఆనందంగా ఉంటుందో తెలుసా! గాలితో పోటీపడుతూ పైపైకి ఎగురుతూ పోతాను. మబ్బులను తాకుతాను. పైనుంచి మిమ్మల్ని చూస్తుంటే మీరు చీమల్లాగ చిన్నగా కనిపిస్తారు. పెద్ద పెద్ద భవనాలవంటివన్నీ కూడా అగ్గిపెట్టెల్లాగ చిన్నగా కనిపిస్తూంటాయి. ఇలా చూస్తుంటే నాకు భలే సరదాగా అనిపిస్తుంది. మీరు నాతో ఆడకుంటే ఒంటరిగా ఏ మూలో ఉండిపోతాను.


పూర్వకాలంలో మా తాతముత్తాతలు చైనాలో ఎక్కువగా ఉండేవారట. ఇప్పటికీ ఆ దేశంలో "గాలిపటాల పండుగ" ప్రత్యేకంగా జరుపుకుంటూ ఉంటారు. తరవాత ఎప్పుడో ఈ దేశానికి వచ్చాను. మీలాగే మీ పెద్దలు కూడా నాతో ఆడుకున్నారు. సంక్రాంతి పండుగ అంటే నాకు చాలా



© SCERT not to be republished



3rd Telugu FL initial pages fina96 96 28-08-2012 13:33:03



ఇష్టం. ఎందుకో తెలుసా? భోగిపండుగ రోజున మీరు నన్ను రకరకాల ఆకారాలతో అందంగా అలంకరించి పోటీలు పడి ఎగరేస్తూ ఉంటారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నాలో కూడా చాలా మార్పులు వచ్చాయి.

ఇప్పుడు మీరు చూస్తున్నారుగా! మాలో కొందరికి తోకలు లేవు. కొందరివి పెద్ద పెద్ద తోకలు. కొందరికి చారెడేసి కళ్ళు. కొందరివి డ్రాగన్ లాంటి వింత ఆకారాలు. ఐనా అందరం ఆకాశంలో స్వేచ్ఛగా ఎగురుతూనే ఉంటాం.

మేము ఎంత పైకి ఎగిరినా మా ప్రాణం మీ గుప్పిట్లోనే ఉంటుంది. అదేమిటో చెప్పుకోండి. దాన్ని కొందరు 'మాంజా' అంటారు. మాంజా అంటే గాలిపటాలకు ఉపయోగించే ప్రత్యేక దారం. మాంజా తయారీలో కోడిగుడ్డు సొన, గాజుముక్కల పొడి, సన్న ఇసుక, జిగురు పదార్థాలను కలిపి దారానికి పూస్తారు. దారం గట్టిపడుతుంది. మీరు నన్ను ఎగరవేసేటప్పుడు విశాలమైన ప్రదేశాలనుంచి ఆటస్థలాల్లో ఎగరవేయండి. ఇళ్ళ పైనుంచి ఎగురవేయకండి. ప్రమాదాలు జరుగుతాయి.


మీలో మీరు పోటీలు పడి ఆడుతున్నప్పుడు బలహీనమైన దారాన్ని బలమైన మాంజా కోసేస్తుంది. మా ఆధారం కాస్తా పుటుక్కున తెగిపోతుంది. దిక్కూ మొక్కూ లేక చెట్టుకొమ్మలకో, కరెంటు తీగలకో చిక్కుకుపోతాం. ఆటలో ఓడిన మీరు బాధపడతారు. ఎక్కడో చిక్కుకుపోయి మేమూ బాధపడతాం. నన్ను కిందికి దింపడానికి మీరు చెట్లు, గోడలు ఎక్కేస్తారు. ఆ పని మాత్రం చేయకండి. కాలు జారిందంటే ఎంత ప్రమాదమో! అయినా ఏం చేస్తాం? గెలుపయినా, ఓటమి అయినా సహజమేనని అనుకోవాలి. చాలామంది మమ్మల్ని బజారులో కొనుక్కొంటారు. కొందరు మాత్రం సొంతంగా తయారు చేసుకొంటారు. నన్ను ఎలా తయారు చేస్తారో మీకు తెలుసా? ఎలా చేస్తారో చెపుతా వినండి.




© SCERT not to be republished




3rd Telugu FL initial pages fina97 97 28-08-2012 13:33:03




ముందుగా ఒక రంగు కాగితాన్నో, వార్తాపత్రికనో తీసుకోండి. దాన్ని నలుచదరంగా కత్తిరించండి. అంటే నాలుగు మూలలూ సమానంగా ఉండేలా కత్తిరించండి. ఇదుగో ఈ బొమ్మలో చూపించినట్లుగా చెయ్యండి.




ఇప్పుడు సన్నని వెదురు పుల్లల్ని కానీ, కొబ్బరి ఈనెలను కానీ తీసుకోండి. వీటిలో ఒక ఈనెను లేదా పుల్లను కాగితంమీద ఒక మూలనుంచి ఇంకో మూలకు సమానంగా ఉండేలా చూడండి. పుల్లమీద చిన్న చిన్న కాగితం ముక్కలను అతికించండి.



రెండో పుల్లను తీసుకోండి. మొదటి దానికన్నా కొద్దిగా పొడవుగా ఉండే దాన్ని తీసుకోండి. ఈ పుల్లను బాణం ఆకారంలో వంచి మూలలను కాగితపు ముక్కలతో అతికించండి. రెండు పుల్లలూ కలిసిన చోట దారంముక్కతో గట్టిగా కట్టి వెనక వైపునకు వదలండి.



దానికి కొద్దిగా కిందుగా నిలువు పుల్లకు మరో దారం ముక్కను కట్టి దాని కొనను కూడా వెనుకకు వదలండి. ఇప్పుడు వెనుకకు వదిలిన రెండు దారపు కొసలనూ కలుపుతూ మాంజా ముడి వేయండి. 'కళ్ళు' గీయండి.



కింది వైపున రిబ్బన్ ఆకారంలో కాగితం కత్తిరించి తోకను అతికించండి. ఇక నేను తయారయిపోయినట్టే! ఎగరడానికి నేను సిద్ధం! మీరు నాకు ఎంత పొడుగు మాంజాను ఇస్తే నేనంత ఎత్తుకు ఎగురుతాను.

ఇక వదలండి నన్ను ! ఆడుతూ పాడుతూ ఎగిరి గంతులు వేయండి !



© SCERT not to be republished



3rd Telugu FL initial pages fina98 98 28-08-2012 13:33:03

## ఇవి చేయండి

### I వినండి - ఆలోచించి చెప్పండి



అ) పాఠం చిత్రం చూడండి. చిత్రంలో గాలిపటం పిల్లలతో ఏం మాట్లాడుతున్నదో చెప్పండి.

ఆ) గాలిపటాన్ని ఎలా తయారు చేస్తారో చెప్పండి.

ఇ) నువ్వు గాలిపటాన్ని కొనడానికి వెళ్తే దుకాణదారునితో ఎలా మాట్లాడతావు?

ఈ) గాలిపటాన్ని ఎగరవేస్తూ మీ స్నేహితులతో మీరు ఎలా మాట్లాడతారు?

### II ధారాళంగా చదవండి - అర్థంచేసుకొని చెప్పండి. రాయండి



అ) "పూర్వకాలంలో మా తాతముత్తాతలు చైనాలో ఉండేవారు," అని తెలిపే పేరా చదవండి. మీ మాటల్లో చెప్పండి.

ఆ) రవి 'టీ' పెట్టాలని అనుకున్నాడు. 'టీ' ఎలా తయారుచేయాలో కింది వాక్యాలలో ఉంది. అవి తారుమారయాయి. వాటిని సరైన క్రమంలో రాయండి.

గ్లాసులో పోయాలి
పాలు కలపాలి.
పొయ్యిమీద పెట్టి మరిగించాలి.
పంచదార వెయ్యాలి.
గిన్నెలో నీళ్ళు పెట్టాలి.
నీళ్ళలో టీ పొడి వేయాలి.



ఇ) కింది పొడుపు కథను వినండి. ప్రశ్నలకు సమాధానం చెప్పండి.



ఆకాశంలో ఎగురుతాను, పక్షిని కాను,
తోక ఉన్నది కానీ కోతిని కాను.
రెక్కలు లేవు గానీ పక్షిలా పైకి ఎగరగలను
నేనెవరో మరి చెప్పండి.



1. ఆకాశంలో ఎగిరేవి ఏవి ?
2. తోక ఉన్న జంతువుల పేర్లు చెప్పండి.
3. గాలిపటాన్ని వేటితో పోల్చి చెప్పారు?
4. విన్న పొడుపు కథను మీ మాటల్లో చెప్పండి.

©SCERT not to be republished



3rd Telugu FL initial pages fina99 99 28-08-2012 13:33:03

**ఇ) పొడుపు కథలు చదివి, సరైన సమాధానంతో జతపరచండి.**

1) పాకాల చెరువులో పది గుంజలు
ఊపితే ఊగుతాయి పీకితే రావు. **పోస్టుకార్డు**

2) కిట కిట తలుపులు కిటారు తలుపులు
ఎప్పుడు తీసినా చప్పుడు కావు **పనసపండు**

3) అమ్మ అంటే కలుస్తాయి
నాన్న అంటే కలవవు. **చేతివేళ్ళు**

4) తోకలేని పిట్ట
తొంభై ఆమడలు పోతుంది. **కనురెప్పలు**

5) తండ్రి గర గర తల్లి పీచు పీచు
బిడ్డలు రత్నమాణిక్యాలు. **పెదవులు**

## III ఆలోచించి రాయండి



**అ) గాలిపటం తనను గురించి ఏం చెప్పిందో రాయండి.**

**ఆ) మీరు గాలిపటాన్ని ఎలా తయారు చేస్తారో రాయండి.**

**ఇ) గాలి పటం లాగా ఇంకా మీరు వేటిని తయారు చేయగలరు? వాటితో ఏమేమి ఆటలు ఆడతారు?**

**ఈ) "మేము ఎంత పైకి ఎగిరినా మీ గుప్పిట్లోనే ఉంటుంది మా ప్రాణం" అని గాలిపటం ఎందుకన్నది?**

## IV పదజాలం




**అ) పాఠంలో ఒక హల్లు కింద వేరొక హల్లు ఒత్తుగా చేరిన పదాలను వెతికి రాయండి.**

ఉదా : ఇష్టం ................ ................

................ ................ ................

**ఆ) కింద గీత గీసిన పదానికి వ్యతిరేకార్థంలో వాక్యం రాయండి.**



1) నేను పక్షిలా ఎగరగలను.
ఉదా: నేను పక్షిలా ఎగరలేను.


2) నేను గాలిపటం తయారు చేయలేను.

..............................................................

3) మేము ఇంటి దగ్గర ఆడుకోం.

..............................................................

© SCERT not to be republished



4) నాకు ఆటలంటే ఇష్టం లేదు.

..............................................................

5) మేము అన్ని పండుగలనూ జరుపుకొంటాం.

..............................................................

**ఇ) కింది వాక్యం చూడండి. వచనం మారినప్పుడు వాక్యంలో ఎలాంటి మార్పులు వస్తున్నాయో గుర్తించండి.**



ఉదా: ఆకాశంలో గాలిపటం ఎగురుతున్నది.

ఆకాశంలో గాలిపటాలు ఎగురుతున్నాయి.

**ఈ) ఇలాగే కింది వాక్యాలను మార్చి రాయండి.**

1) గాలిలో పక్షి ఎగురుతుంది.

..............................................................

2) గంపకింద కోడి ఉంది.

..............................................................

3) చెట్టుపైన కాకి ఉంది

..............................................................

4) చెరువులో చేప ఈదుతున్నది.

..............................................................

© SCERT not to be republished

## V సృజనాత్మకత

**అ) గాలిపటం తనను గురించి తాను చెప్పుకొన్నది గదా! మీ గురించి మీరు రాయండి.**



నా పేరు ....................

నేను .................... ఊరిలో ఉంటాను.



మా అమ్మ పేరు ....................

మా నాన్న పేరు ....................

నేను .................... తరగతి చదువుతున్నాను.

నా మిత్రులు ....................

మేమంతా రోజూ ....................

నేను ప్రతి రోజూ నా మిత్రులతో ......................

నేను రోజూ బడిలో ............................

నాకు ................... అంటే కూడా ఇష్టం

కాని ................................................



## VI ప్రశంస / ప్రాజెక్టు పనులు



**అ) గాలిపటాన్ని తయారు చేయండి.**

**ఆ) గాలిపటం చిత్రాన్ని మీకు నచ్చిన విధంగా గీసి రంగులు వేయండి.**

**ఇ) గాలిపటాల పాటలు సేకరించి పాడండి.**

## VII భాషను గురించి తెలుసుకుందాం

**అ) కింది వాక్యాలను చదవండి. గీత గీసిన పదాలను చూడండి.**



ఉదా: లక్ష్మి తెలివైన బాలిక. ఆమె రోజూ కథల పుస్తకాలు చదువుతుంది.

మొదటి వాక్యంలో **'లక్ష్మి'** నామవాచక పదం కదా! రెండవ వాక్యంలో **'ఆమె'** అనే పదాన్ని లక్ష్మికి బదులుగా వాడారు. ఇలా నామవాచకాలకు బదులుగా వాడే పదాలను **"సర్వనామాలు"** అంటారు.

**ఆ) కింది వాక్యాలలో సర్వనామాలను గుర్తించండి. వాటి కింద గీయండి.**

1) ఫాతిమా చక్కగా పాడుతుంది. ఆమె రోజూ పాడడం అభ్యాసం చేస్తుంది.

2) వేణు, కిశోర్ స్నేహితులు. వాళ్లు కలిసిమెలిసి ఉంటారు.

3) రామయ్య పొలంలో పనిచేస్తున్నాడు. ఆయన పొలం నుండి సాయంత్రం ఇంటికి వస్తాడు.

4) పిల్లి పాలు తాగుతుంది. అది రోజూ పాలకోసం వెదుకుతుంది.

5) హైదరాబాదు చాలా పెద్ద నగరం. అక్కడ విశాలమైన రోడ్లు, భవనాలు ఉన్నాయి.



### నేనివి చేయగలనా?



| | | |
|---|---|---|
| 1. | గాలిపటం ఆత్మకథను సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 2. | పాఠాన్ని ధారాళంగా చదవగలను. సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 3. | గాలిపటం గురించి సొంతమాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 4. | గాలిపటాన్ని సొంతంగా తయారుచేయగలను. | ఔను / కాదు |

**పట్టుదల, ఏకాగ్రత, బుద్ధిబలం, దక్షత గలవారినే విజయం వరిస్తుంది.**

© SCERT not to be republished



3rd Telugu FL initial pages fina102 102 28-08-2012 13:33:03